రాము కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

స్నేహితుడికి ఆర్థికసాయం

కేసముద్రం, అక్టోబర్ 31: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన కందిపాటి రాము అనారోగ్యంతో బాధపడుతుండగా చికిత్స కోసం స్నేహితులు రూ.24వేల ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు. నిరుపేద కందిపాటి రాము అనారోగ్యంతో బాధపడుతుండగా గ్రామస్తుల సహకారంతో విరాళాలు సేకరించి, హనుమకొండలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో అతడిని పరామర్శించి ఆర్థికసాయం అందించినట్లు వారు తెలిపారు. ఈసంపల్లి ఉదయ్, వేల్పుల యాకయ్య, జల్లె సురేశ్, ఆరెపు కిరణ్‌కుమార్, కొంతం శరత్, జల్లె హరీశ్, నవీన్, మూరగుండ్ల పవన్, వంగాల అనిల్, బొడ్డు వెంకటేశ్ ఉన్నారు.

సొసైటీ సభ్యులతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో నాగమణి

ఆక్సిజన్ అందకే చెరువులో చేపలు మృతి

కేసముద్రం, అక్టోబర్ 31: మండలంలోని ఉప్పరపల్లి ఊర చెరువులో నీరు కలుషితమై ఆక్సిజన్ అందక చేపలు మృతిచెందుతున్నాయని జిల్లా మత్స్య శాఖ అధికారి నాగమణి తెలిపారు. మత్స్యశాఖ అధికారులు మంగళవారం పరిశీలించి మాట్లాడారు. చేపలకు ఎలాంటి రోగం రాలేదని, కేసముద్రం నుంచి వచ్చే మురుగునీటి వల్ల ఆక్సిజన్ అందక మృతిచెందుతున్నాయని పేర్కొన్నారు. చెరువులోకి మురుగునీరు చేరకుండా చూసుకోవాలన్నారు. చనిపోయిన చేపలను వెంటనే తీసి పూడ్చివేయాలని సూచించారు. మృతిచెందిన చేపల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని అంచన వేశారు. మత్స్య సొసైటీ చైర్మన్ భద్రయ్య, జెనిగల అనిల్, బోనగిరి వీరయ్య, అంకిరెడ్డి యాకయ్య, ఉప్పలయ్య, విజేందర్, వెంకన్న, శ్రీనివాస్, వేణు ఉన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఎన్నిక

తొర్రూరు, అక్టోబర్ 31: పాస్టర్స్ అసోసియేషన్ మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా రెవరెండ్ ఫాదర్ కే.నిరీక్షణరావు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ జె.జాన్సన్, జనరల్ సెక్రెటరీగా బి.కృష్ణ మోహన్, జాయింట్ సెక్రెటరీగా విక్టర్ పాల్, కోశాధికారిగా జీవన్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా బి.దేవాసహాయం, ఫాదర్ సునీల్, శేఖర్‌రాజు ఎన్నుకున్నారు.

ఎన్నికల విధులను అవగాహనతో నిర్వర్తించాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక

మహబూబాబాద్, అక్టోబర్ 31: ఎన్నికల విధులను పూర్తి అవగాహనతో నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక తెలిపారు. నోడల్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం ఫాతిమా స్కూల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఎన్నికల విధులపై తొలివిడత ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రెండు సంపూర్ణ నియోజకవర్గాల్లో 539, పాక్షిక నియోజకవర్గాలైన పాలకుర్తి, ఇల్లందు, ములుగుతో కలిపి మొత్తం 773 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోలింగ్ అధికారులకు అందజేసిన ప్రచురణలను పూర్తిగా చదివి అవగాహన పెంచుకోవాలని సూచించారు. పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులకు పోస్టల్ బ్యాలెట్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధులను సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. శిక్షణలో అదనపు కలెక్టర్ డేవిడ్, సీపీఓ సుబ్బారావు, విద్యాశాఖ అధికారి రామారావు, ఎన్నికల నోడల్ అధికారులు సూర్యనారాయణ, సహాయ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి సురేశ్‌కు గులాబీ కప్పుతున్న జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీ నుంచి భారీగా చేరికలు

నెల్లికుదురు, అక్టోబర్ 31: మండలంలోని నర్సింహులగూడెం కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీటీసీ వనగండ్ల లక్ష్మీవెంకన్న, బీజేవైఎం నెల్లికుదురు మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల సురేశ్, బీజేపీ నాయకుడు వరిపెల్లి సురేశ్ మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జడ్పీటీసీ మేకపోతుల శ్రీనివాస్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సహకారంతో మానుకోటలో ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చేస్తున్న అభివృద్ధిని చూసి ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నుంచి నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. 60 ఏండ్లలో జరగని అభివృద్ధిని సీఎం కేసీఆర్ పదేండ్లలో చేసి చూపారని పేర్కొన్నారు. మానుకోట గతంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేదని, ప్రస్తుతం ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బత్తిని అనిల్, నర్సింహులగూడెం ఎంపీటీసీ వేశాల కృష్ణయ్య, ఆలేరు ఉపసర్పంచ్ ఎండీ షరీఫ్, నాయకులు మద్దినేని వెంకన్న, రూపిరెడ్డి గోపాల్‌రెడ్డి, కాలేరు సంజయ్, వార్డు సభ్యులు జి.గోవర్ధన్, సుధాకర్, రాజన్న, మహేశ్, రమేశ్ పాల్గొన్నారు.

నర్సింహులగూడెం మాజీ ఎంపీటీసీ లక్ష్మీవెంకన్నకు గులాబీ కండువా కప్పిన బీఆర్ఎస్ పార్టీలోకి స్వాగతిస్తున్న జడ్పీటీసీ

అశోక్‌కు డాక్టరేట్

అశోక్

కేసముద్రం, అక్టోబర్ 31: మండల కేంద్రంలోని కిష్టాపురం కాలనీకి చెందిన నల్లగొండ అశోక్ మంగళవారం డాక్టరేట్ పట్టా పొందాడు. ఎఫెక్ట్ ఆఫ్ వేర్ ట్రైనింగ్ డిజైన్స్ ఆన్ జనరల్ మోటర్ ఎబిలిటీ ఇంటర్ కాలేజ్ ఎట్ బాస్కెట్ బాల్ విభాగంలో పరిశోధనలు చేసినందుకు జేఎన్‌టీయూ హెచ్ కార్యదర్శి దిలీప్‌కుమార్ డాక్టరేట్ అందించినట్లు పేర్కొన్నారు. డాక్టరేట్ సాధించిన అశోక్‌ను మండల వాసులు అభినందించారు.

కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్రం

కేసముద్రం, అక్టోబర్ 31: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని ఏఐటీయూసీ మండల కార్యదర్శి మంద భాస్కర్ అన్నారు. ఏఐటీయూసీ 104 ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మేకిన్ ఇండియా పేరుతో కార్మికుల శ్రమను దోచేలా కార్పొరేట్, పెట్టుబడిదారులకు అనుకూలంగా కార్మికచట్టాలను సవరిస్తోందని చెప్పారు. 44 కార్మికచట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికచట్టాలను కాలగర్భంలో కలుపుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. వడ్డెబోయిన లక్ష్మీనర్సయ్య, దాసరి లింగస్వామి, జిలాని, పట్ల సుధాకర్, శ్రీను, నరేశ్, వెంకన్న, రాజు, మౌలానా, శ్రీను, కిషన్‌రావు, బాలాచారి, ఉప్పలయ్య, రవి ఉన్నారు.

గార్లలో రాకాసి చేప

గార్ల, అక్టోబర్ 31: గార్ల పెద్ద చెరువు సంఘాల తూము కాల్వలో మంగళవారం రైతు బండి ఉపేందర్‌కు చేప లభ్యమైంది. పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్తుండగా కాల్వలో దొరికింది. ఈ చేపను గార్ల బెస్తబజారుకు తీపుకెళ్లగా స్థానికులు ఆసక్తి చూశారు.

సీఎం కేసీఆర్ సభకు తరలి రావాలి

గార్ల, అక్టోబర్ 31: ఇల్లందులో బుధవారం జరిగే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ కార్యకర్తలు తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ప్రతి ఒక్కరూ వినాలని కోరారు. ఇల్లందు ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ హరిప్రియా నాయక్ గెలుపు కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ మూడు శివాజీ, ఎంపీటీసీ శీలంశెట్టి రమేశ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పానుగంటి రాధాకృష్ణ, ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ మందనపు భాస్కర్‌రావు, మండల కో ఆప్షన్ ఖదీర్‌బాబా, బీసీ సెల్ నాయకులు తోట కొండల్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్

నర్సయ్యకు గులాబీ కండువా కప్పుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి

బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీటీసీ

గంగారం, అక్టోబర్ 31: మండలంలోని మడగూడెం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ రాజంనర్సయ్య మంగళవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇర్ప సూరయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. రెడ్కో చైర్మన్ ఏరువ సతీశ్‌రెడ్డి, ఓడీసీఎంఎస్ చైర్మన్ దేశిడి శ్రీనివాసరెడ్డి, రాజు, రంజిత్, సారంగపాణి పాల్గొన్నారు.

బయ్యారంలో మంత్రి సత్యవతి బర్త్‌డే వేడుకలు

బయ్యారం, అక్టోబర్ 31: గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ జన్మదిన వేడుకలు మంగళవారం జిల్లా నాయకులు అంగోత్ శ్రీకాంత్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు జరుపుకున్నారు. రిటైర్డ్ టీచర్లు వెంకటరెడ్డి, ఆర్‌వీ ప్రసాద్‌రావు, ఎర్ర శ్రీను, సొసైటీ డైరెక్టర్ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల నాయకులు బొబ్బిలి కిరణ్‌రెడ్డి, సంకు సత్తిరెడ్డి, గుగులోత్ మంగీలాల్, శ్రీకాంత్‌నాయక్, దరావత్ కిషన్‌నాయక్, తారాచంద్, శ్రీను, సునిల్, నరేష్, లచ్చి రాం, రంగయ్య, నరేంద్రచారి, పిచ్చయ్య, కృష్ణ, మంత్రియ పాల్గొన్నారు.

బయ్యారం బస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

తొర్రూరు కాలేజీలో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ

తొర్రూరు, అక్టోబర్ 31: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా ప్రతిజ్ఞ చేశారు. ప్రిన్సిపాల్ రెబ్బ శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నారాయణ, అధ్యాపకులు రమేశ్, కుమారస్వామి, సువర్ణ, అన్నపూర్ణ, నర్సయ్య, ఉప్పలయ్య చారి, శివ, మల్లయ్య, అనిత, రాజేశ్, అలీ పాల్గొన్నారు. కొమ్మనపల్లి పాఠశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవంలో హెచ్ఎం రాయిపల్లి యాకయ్య, దామోదర్ పాల్గొన్నారు.